క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



మల్హర్: మండలంలో నాచారం గ్రామానికి చెందిన మహమ్మద్ సిద్దిక్ ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సాయం కోసం కుటుంబ సభ్యులు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.50 వేలు ఎల్‌ఓసీ మంజూరు చేయించి మంత్రి శ్రీధర్‌బాబు ఆస్పత్రి సహాయకుడి ద్వారా సోమవారం ఎల్‌ఓసీ పత్రానికి కుటుంబ సభ్యులకు అందించారు.

పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వాలని దరఖాస్తు



కాటారం: మండల కేంద్రంతో పాటు సుందరాజ్‌పేటలోని సర్వే నంబర్ 501, 418, 94లో గల అసైన్డ్ భూములకు పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వాలని సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య ఆధ్వర్యంలో రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వకపోవడంతో సాగు చేసుకుంటున్న రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కలెక్టర్‌కు ఎంపీపీ విన్నవించారు. రైతులు రైతు భరోసా, ఇతరాత్ర ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. రైతులకు పట్టాపాస్ పుస్తకాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

నిబంధనలు పాటించడం లేదని ఫిర్యాదు



కాళేశ్వరం: కాళేశ్వరం గ్రామంలోని మద్యం దుకాణాల టెండర్ దక్కించుకున్న యజమానులు నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని కలెక్టర్ రాహుల్‌శర్మకు గ్రామానికి చెందిన కోల మహేష్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. అన్ని రకాల మద్యం బ్రాండ్లు విక్రయించడం లేదని ఇక్కడి మద్యం అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్ వెంటనే జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు విచారణకు ఆదేశించారు. మద్యం ప్రియులకు అందుబాటులో సరైన మద్యం అందుబాటులో లేకుంటే సంబంధిత షాప్ యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ రాహుల్ శర్మకు యువకుడు కృతజ్ఞతలు తెలిపాడు.

కలెక్టర్‌కు సన్మానం



చిట్యాల: కలెక్టర్ రాహుల్ శర్మను చిట్యాల ఎంపీటీసీ కట్కూరి పద్మ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సన్మానించారు. ఆమె వెంట తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కట్కూరి నరేందర్ ఉన్నారు.

కీటక కాలం.. జాగ్రత్త!

వానాకాలంలో పాములతో పొంచి ఉన్న ప్రమాదం

- అన్నదాతలు.. అప్రమత్తత అవసరం



మహాముత్తారం: వానాకాలం మొదలవ్వగానే ఖాళీ స్థలాలన్నీ గడ్డి, మొక్కలతో చిత్తడిగా మారి నీటి మడుగులుగా మారుతాయి. ఈ క్రమంలోనే ఆయా ప్రదేశాల్లో విష పురుగులు సంచరిస్తుంటాయి. ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా కాటేసి ప్రాణం మీదికి తెస్తాయి. అందుకే ముఖ్యంగా రైతులు, కూలీలు అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉండే వారు నివాసాల సమీపంలో పొలాలు, పొదలు ఉన్న వారు జాగ్రత్తగా మొదగాల్సిన అవసరం ఎంతైన ఉంది. వర్షాకాలంలో ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో పాములు ఎక్కువగా సంచరిస్తుంటాయి. అజాగ్రత్తగా ఉంటే కాటు వేస్తాయి. ఇదే సీజన్‌లో రైతులు, కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన సమయంలో పాము కాటుకుగురయ్యే ప్రమాదాలు అధికంగా ఉంటాయి. కప్పలు కూడా బయటకు వచ్చే కాలం ఇదే కాబట్టి వాటిని వేటాడేందుకు పాములు సంచరిస్తుంటాయి. మన ప్రాంతాల్లో తాచుపాము, కట్లపాము, రక్తపెంజర తదితర విష పూరిత పాములు ఎక్కువగా ఉండగా వాటి కాటుకు గురైన బాధితులకు వెంటనే వైద్యం అందకపోతే ఒక్కోసారి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. పొలంగట్లు, కాల్వగట్లు, పశువులపాకలు, గుబురు ప్రదేశాలు, పొదలు, గడ్డివాములు, పాడుబడ్డిళ్లు, పేర్చిన కట్టెలవాము, పెంటకుప్పల్లో విషపురుగులు ఎక్కువగా సంచరిస్తుంటాయి. ఆహారం కోసం రాత్రి సమయాల్లో బయటకు వచ్చి ఎలుకలు, తొండలు, బల్లులను పట్టుకొని తింటాయి. ఇలాంటి ప్రాణులు ఎక్కడ ఎక్కువగా సంచరిస్తాయో పాములు కూడా అక్కడే తిష్ట వేస్తాయి. పాములకు చెవులు ఉండనప్పటికీ వాటి శరీరంలో కింద భాగంలో ఉండే ప్రత్యేక పొలంసుల ద్వారా శబ్ద ప్రకంపనలు గ్రహిస్తాయి. వేడి రక్తం ప్రవహించే జంతువులు, మనుషులు సమీపిస్తే వెంటనే గుర్తించి కాటు వేస్తాయి. పాములకు ప్రాణభయం ఉన్నప్పుడు ఏకాంతానికి భంగం వాటిల్లినప్పుడు, ఎవరైన తొక్కినప్పుడు మాత్రమే కాటు వేస్తాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

రాత్రి సమయంలో పొలాల్లో తిరిగే వాళ్లు అక్కడే నిద్రించే వారు వెంట టార్చిలైటు ఉంచుకోవాలి. ఎప్పటి కప్పుడు పరిసరాలను శుభ్రం చేసుకోవాలి. పెట్రోల్, కిరోసిన్, వెల్లుల్లి వాసనలను పాములు భరించలేవు. పాములు ఎక్కువగా ఉండే చోట సమయానుకూలంగా వీటిని ఉపయోగించాలి. రాత్రి సమయంలో పొలాలు, గడ్డివాముల్లో రోజు తిరిగే రైతులు, కూలీలు మోకాళ్ల దాకా రబ్బరు బూట్లు దరించడం మంచిది. గడ్డిలో పని చేసే వారు. చేతికి రబ్బరు బ్లౌజులు తొడగాలి. ఇళ్ల, పాఠశాలు, కార్యాలయాల వద్ద పొదలు లేకుండా చూసుకోవాలి.

ప్రథమ చికిత్స ఇలా..

- పాముకాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందకుండా ఉండాలి. పక్కన ఎవరైన ఉంటే బాధితులకు ధైర్యం చెప్పేందుకు ప్రయత్నించాలి.
- కాటు వేసిన పైభాగంలో వెంటనే తాడు, గుడ్డ పీలికలతో కొంత శరీరాన్ని రక్తం ఆడకుండా బిగించి కట్టివేయాలి.
- కాటు వేసిన శరీరభాగంలో పదునైన బ్లేడుతో గాయం చేసి రక్తం కారనివ్వాలి.
- పాముకాటుకు గురైన వ్యక్తిని నడిపించొద్దు, పరుగు పెట్టించొద్దు.
- పసర్లు, నాటుమందులని కాలయాపన చేయకుండా తక్షణమే దగ్గరలోని వైద్యశాలకు తీసుకువెళ్లాలి.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న రాజేందర్

భూపాలపల్లి అర్బన్: ప్రజాసమస్యలపైన సీపీఎం పార్టీ రాజీలేని పోరాటం చేస్తునే ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు పొలం రాజేందర్ అన్నారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రామిక భవనంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పార్టీ రాజకీయ శిక్షణ తరగతులకు సోమవారం గడప శేఖర్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పోలం రాజేందర్ పార్టీ విశిష్టత పాఠం బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో కాని భారతదేశంలో కాని ఎర్రజెండాను అంతం చేయాలని అనేకమంది సామ్రాజ్యవాదులు పెట్టుబడిదారులు భూస్వాములు సంపన్నులు అనేక రకాల ప్రయత్నాలు చేశారన్నారు. అయినా అంతం చేయడం ఎవరి వల్ల కాలేదని, కాబోదని అన్నారు. ఎర్రజెండానే పేదలకు అండ అని అన్నారు. ఎర్రజెండా పార్టీలే ప్రజా సమస్యల పరిష్కారానికి ముందు ఉంటాయని తెలిపారు. బూర్జువ పార్టీలు పెట్టుబడిదారులు ప్రజల శ్రమని దోచుకుని లాభాలు ఘటిస్తున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎర్రజెండాకు ఆదరణ పెరుగుతుందని అదేవిధంగా దేశంలో కూడా సీపీఎం పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వెలిశెట్టి రాజయ్య, వంగాల విజయలక్ష్మి, ఆకుదారి రమేష్, మేకల మహేందర్, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల విరాళం



చెక్కు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మల్హర్: మండలంలోని తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో 1993–94 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు సోమవారం రూ.15,116 విరాళంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాబుద్దులు నేర్పిన పాఠశాల రుణం తీర్చుకోవాలనే సంకల్పం చేసుకోని డబ్బులు సేకరించి, పాఠశాలకు అందించిటనట్లు తెలియజేశారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్క భాస్కరావు, పూర్వ విద్యార్థులు కోడిమ్యాల భాస్కర్, పైడాకుల సంపత్, రమేశ్, బొంతల రాజు, కుంట సది, గద్రెపల్లి రమేశ్, బుర్ల శ్రీను, పులిగంటి రామన్న, బండి రాజశేఖర్, వేముల సదానందం తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

- ఆరుగురిపై కేసు నమోదు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం రాపల్లికోటకు చెందిన బొగ్గుల భాస్కర్ అనే యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి ఆదివారం పాల్పడ్డాడు. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భాస్కర్ అతడి భార్య శైలజల మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఆమె భాస్కర్‌పై మంథని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో వారు కౌన్సెలింగ్ ఇచ్చి పెద్దల సమక్షంలో మాట్లాడాలని తెలిపారు. పంచాయతీలో భార్య ఆమె తల్లి, సోదరులు దుర్భాషలాడుతూ తిట్టారు. దీంతో దాడి చేశారని మస్తాపం చెంది పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఈ మేరకు మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం భాస్కర్ తల్లి బొగ్గుల సాంబలక్ష్మీ మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొగ్గుల శైలజ, జోడు సరోజన, రామ్మూర్తి, రాజు, శంకర్, ప్రమీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

గొత్తికోయగూడెంలో వైద్యశిబిరం

వెంకటాపురం(ఎం): మండలంలోని బుర్గుపేట శివారులో గల ఊట్లతోగు గొత్తికోయగూడెంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 118 మందిని పరీక్షించి 29 మంది నుంచి రక్తనమూనాలు సేకరించారు. అనారోగ్యంగా ఉన్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బాలింతలకు, చిన్నారులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ సదానందం, హెల్త్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు అనురాధ, వజ్ర తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మల్హల్‌రావు

మల్హర్: ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో వచ్చే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు అన్నారు. మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షత సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. మండల వ్యవసాయశాఖ అధికారి అట్టె సూధాకర్ మాట్లాడుతూ.. రైతులకు సబ్సిడీపై 221.9 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు అందించినట్లు తెలిపారు. వానకాలం పంటల సాగు, నకిలీ విత్తనాలు, ఎరవులుపై పలు దఫాలుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే తదితర శాఖల అధికారులు చేపట్టిన, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారికి సూచించారు. గ్రామాల్లో తాగు నీటీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, నూనతనంగా మంజూరైన బోర్లను ప్రధాన రహదారులకు దూరంగా వేయాలని ఆర్‌డబ్ల్యూస్ అధికారులకు సూచించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అయిత కొమల, వైస్ ఎంపీపీ బడితెల స్వరూప, ఎంపీటీసీ మల్క కవిత, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్యామ్‌సుందర్, విద్యుత్ ఏఈ సంపత్, వైద్యాధికారి రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరిత తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ తోటలకు ప్రోత్సాహక రాయితీ



భూపాలపల్లి రూరల్: జిల్లాలో 2022–23 సంవత్సరంలో ఆయిల్ పామ్ సాగుచేసిన రైతులకు రెండవ సంవత్సరం తోటల అంతర పంటల సాగు కోసం రూ.73,42,860.00లను రైతులకు ప్రోత్సాహక రాయితీ నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా ఉద్యాన వనశాఖ అధికారి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 572 మంది ఆయిల్ పామ్ తోటల రైతులకు ఎకరానికి అంతర పంటల సాగు కోసం రూ.2100, రాయితీ కోసం రూ.2100 మొత్తం నిధులు విడుదలయ్యాన్నారు. వారం రోజులలోపు సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



భూపాలపల్లి రూరల్: మహిళ సమాఖ్య భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



చిట్యాల: బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: మహిళ సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం పట్టణంలోని సుభాష్ కాలనీలో రూ.27.60 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ రిసోర్స్ సెంటర్(సీఆర్పీ) భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి ఎమ్మెల్యే సత్యనారాయణరావు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. త్వరలోనే 55 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.2500 అందించేలా కసరత్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పారదర్శకంగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ..

పట్టణంలోని నిరుపేదలను గుర్తించి డబుల్ బెడ్ రూంల పంపిణీ చేస్తామన్నారు. గతంలో డబుల్ బెడ్‌రూంలు ఇప్పిస్తామని నిరుపేదలనుంచి లంచాలు తీసుకున్న నాయకులు పేదల డబ్బులను 20 రోజుల్లో ఇవ్వాలన్నారు. గతంలో పెద్దకుంటపల్లి తండా దగ్గర పంపిణీ చేసిన డబుల్ బెడ్‌రూంల లబ్ధిదారులను పునఃపరిశీలించి అనర్హులను తొలగించి పేదలకు ఇప్పిస్తామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి సిద్దు, కమిషనర్ రాజేశ్వర్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ డిస్ట్రిక్ మిషన్ కోఆర్డినేటర్ రాజేశ్వరీ, కమ్యూనిటీ ఆర్గనైజర్ నిర్మల, టీఎల్‌ఎ ప్రెసిడెంట్ శాతరాసి స్వప్న, ఆర్‌పీలు, పార్టీ కౌన్సిలర్లు ముంజాల రవీందర్, సరళ, ముంజంపల్లి మురళి, పృధ్వీ, పుల్లా మహేష్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

చిట్యాల: గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండలంలోని గిద్దెముత్తారం –కాల్వపల్లి గ్రామాల మధ్య రూ.2కోట్ల నిధులతో నిర్మించిన బీటీ రోడ్డును ఆయన ప్రారంభించి మాట్లాడారు. పల్లె సీమలు బాగుంటేనే రాష్ట్రం బాగుటుందని అన్నారు. టేకుమట్ల జెడ్పీటీసీ పులి తిరుపతి రెడ్డి, ఎంపీటీసీ విజయలక్ష్మీ సంజీవ్, ఎంపీడీఓ జయశ్రీ, పీఆర్‌డీఈలు వెంకటేశ్వర్లు, రవికుమార్, ఏఈ తిరుపతి, మండల పార్టీ అధ్యక్షుడు తిరుపతి, మాజీ సర్పంచ్ సునీత అంజిరెడ్డి పాల్గొన్నారు.

విద్యా, వైద్యానికి పెద్దపీట

టేకుమట్ల: రాష్ట్రంలో ప్రభుత్వం విద్యా, వైద్యానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో రూ.53లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులతో పాటు, భోజనశాలను ప్రారంభించారు. అలాగే పాఠశాలలో మరిన్ని మౌలిక వసతులను కల్పించాలని ప్రాధానోపాధ్యాయుడు సుధాకర్ కోరగా అందుకు సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధానంగా విద్య, వైద్యం ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అలాగే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యాభ్యాసాన్ని అందించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, మండల ప్రత్యేకాధికారి శైలజ, పీఆర్ ఏఈ రాజయ్య, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగి రవికుమార్, ఎంపీటీసీలు ఆదిరఘు, సంపత్‌రావు, లచ్చిరెడ్డి, సారయ్య, మాజీ సర్పంచ్‌లు రామారావు, స్వామిరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, నాంపెల్లి వీరేశం, తోట గట్టయ్య, కిరణ్ పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండలంలోని మొట్లపల్లి గ్రామంలో రూ.25లక్షలతో నూతనంగా నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ప్రారంభించారు. అలాగే పరకాల నుంచి జమ్మికుంట వయా మెట్టుపల్లి, మొట్లపల్లి మీదుగా వెళ్లే నూతన బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి



రైతులకు పెసర్లు అందిస్తున్న శ్రీహరి

చిట్యాల: రైతులు పంటల సాగుకోసం సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ప్రతినిధి దేవులపల్లి శ్రీహరి అన్నారు. సోమవారం మండలంలోని చల్లగరిగ గ్రామంలో రైతులతో నేల ఆరోగ్యాన్ని కాపాడాలంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీహరి మాట్లాడుతూ రసాయనిక ఎరువులు వాడకంతో రోజు రోజుకు నేలలోని భూసారం దెబ్బతింటుందని అన్నారు. సేంద్రీయ వ్యవసాయం చేసే దిశగా రైతులు ముందుకు రావాలని కోరారు. అనంతరం నేలసారాన్ని పెంచేందకు పెసర్లను అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతి నిధి కంజుల మహేష్ , రైతులు ఐలయ్య, సమ్మిరెడ్డి, బామర్ రాంసింగ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత



నియమాక పత్రాలు అందజేస్తున్న జీఎం

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలో నూతనంగా సింగరేణి కారుణ్య నియామకాలు పొందిన ఉద్యోగ అభ్యర్థులకు సోమవారం అధికారులు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ హబీబ్ హుస్సేన్ హాజరు కాగా.. ఆయన చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. నూతనంగా విధుల్లో చేరిన ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేసి సంస్థ అభివృద్ధికి పాటుపడాలన్నారు. క్రమశిక్షణతో పనిచేసి ముందుకు వెళ్లాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు జ్యోతి, తుకారం, రాజు, శ్యాంప్రసాద్, మౌనిక, యూనియన్ నాయకులు రమేష్, బుచ్చయ్య పాల్గొన్నారు.

కూలిన ఎండిన చెట్టు



ఇంటి ఆవరణలో కూలిన చెట్టు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో సీబ్ల్యూసీ(వైర్‌లెస్) కార్యాలయం గోడకు ఆనుకొని ఉన్న ఎండిన భారీ చెట్టు అంకం రాజబాపు ఇంటి ఆవరణలో తెల్లవారుజామున కూలింది. సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో పాటు గాలి వీచడంతో చెట్టు కూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని వారు పేర్కొంటున్నారు. ఎన్ని సార్లు ఆ సిబ్బందికి చెప్పిన వినిపించుకోవడం లేదని బాధితులు పేర్కొంటున్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



మల్హర్: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



కాటారంలో..

మల్హర్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆ పార్టీ నాయకులు అన్నారు. రైతు రుణమాఫీ కేబినేట్ నిర్ణయం తీసుకోవడంపై మండల కేంద్రం తాడిచర్ల హనుమాన్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య ఆధ్వర్యంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఫ్లెక్సీకి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ చేయడంపై అప్పుల్లో కురుకున్న రైతులకు మేలు జరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ రైతులకు రుణమాఫీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, మండల యూత్ అధ్యక్షుడు గడ్డం క్రాంతి, అయిత రాజిరెడ్డి, కేసారపు చంద్రయ్య, మల్క ప్రకాశ్‌రావు, రాజయ్య, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహాముత్తారం: ఏకకాలంలో రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో తీర్మానం చేయడంతో సోమవారం మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంరెడ్డి, రాష్ట్ర ఐటీపరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీదర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కాటారం: రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టడాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలకు పాలాభిషేకరం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి ఆగస్టు 15లోగా రైతులకు రుణమాఫీ చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మహిళ అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, నాయకులు నాయిని శ్రీనివాస్, చీమల రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: హైదారాబాద్ రవీంద్ర భారతిలో జూలై 7న నిర్వహించే దండోర రజతోత్సవాలకు జిల్లా నుంచి మాదిగలు, మాదిగ ఉపకులాల వారు అధిక సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రేనుకుంట్ల కొమురయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దండోర రజతోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరయ్య, శ్రీధర్, రాజేందర్, ఉమ, రాధ తదితరులు పాల్గొన్నారు.